## సఫాయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## కాకతీయ ప్రభుత్వ కళాశాలలో రెండు రోజుల అప్టిట్యూడ్ & రీజనింగ్ సెషన్ ముగింపు..




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 283 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 07 అక్టోబర్ 2026




## ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

**- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని ఇండియా బ్లాక్ డిమాండ్**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి', 'సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి' అని డిమాండ్ చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు ఢిల్లీలో భారీ నిరసన చేపట్టారు. పార్లమెంట్‌లోని మకర్‌ద్వార్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం మిగతా2లో...

## ఎర్రవల్లిలో 45 ఎకరాలు

# ఏమయ్యాయి?

**- భూములపై సమగ్ర సర్వేకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**



**హైదరాబాద్, అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలోని భూములపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో భూముల వివరాల్లో భారీ వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు.రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా, ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు మిగతా2లో...



## రవాణా రంగానికి సమగ్ర ప్రణాళిక

**ఐటీఎల్‌ఏ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** రవాణా, లాజిస్టిక్స్ రంగాల్లో పరిశోధన, ప్రణాళిక, ప్రాజెక్టుల పరిశీలన, పర్యవేక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ అథారిటీ (ఐటీఎల్‌ఏ) ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిగతా2లో...

## డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యం

**● 2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం ● అంతకంటే ముందే తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తాం : గవర్నర్ శివప్రతాప్ శుక్లా**



**మెదక్, అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. దేశవ్యాప్తంగా డ్రగ్స్ వినియోగం, దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మెదక్‌లో పర్యటించిన గవర్నర్ 'నషాముక్త్ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌పై అవగాహన సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు.మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ.. 2029 కంటే ముందుగానే తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు మిగతా2లో...



## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆపరేశ్ కుమార్

**- తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న ఆయన బాధ్యతల స్వీకరణ**

**న్యూఢిల్లీ,అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు. తాజా నియామకాలతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 37కి చేరింది.జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్ 2012లో జార్ఖండ్ హైకోరు మిగతా2లో...

## శ్రీశైలం శరన్నవరాత్రులకు చంద్రబాబుకు ఆహ్వానం

**అక్టోబర్ 11 నుంచి 20 వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు**



**అమరావతి,అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని దేవస్థానం అధికారులు, పాలక మండలి సభ్యులు ఆహ్వానించారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజులపాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిం చేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది.మంగళవారం ఉండవల్లి లోని సీఎం క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు, వేద పండితులు చంద్రబాబును కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు సీఎంకు వేదాశీర్వచనం అందించారు. అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటంతో పాటు మిగతా2లో...



## విద్యుత్ చార్జీలు పెంచొద్దు

**రూ.5,420 కోట్ల ట్రూఅప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలి**

**లేదంటే మరో ప్రజా ఉద్యమం : హరీశ్‌రావు**

**హైదరాబాద్,అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి. హరీశ్‌రావు డిమాండ్ చేశారు. దసరా, దీపావళి పండగల వేళ ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన ప్రభుత్వం, విద్యుత్ బిల్లుల ద్వారా అదనపు భారం మోపొద్దని కోరారు. చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే మరో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒకవైపు కరెంట్ కోతలు, మరోవైపు పెరుగుతున్న విద్యుత్ బిల్లులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మిగతా2లో...

## 8 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ భారం

**అయినా కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**పులిచింతలలో జల విద్యుదుత్పత్తి 70 శాతం తగ్గింది : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**చింతలపాలెం,అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో అదనంగా 8 వేల మెగావాట్ల భారం ఏర్పడిందని, అయిన ప్పటికీ ప్రజలకు ఎక్కడా కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మంగళవారం భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కు మార్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుదుత్పత్తి సామర్థ్యం, ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నా రు. యూనిట్ నియంత్రణ గదిని పరిశీలించి, అధికారులు ఏర్పాటు చేసిన ప్రజెంటేషన్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మిగతా2లో...



## చలో లోక్‌భవన్ ర్యాలీకి తరలిరండి

**- 8న హైదరాబాద్‌లో ఇండియా కూటమి భారీ ప్రదర్శన**

**- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్**

**హైదరాబాద్,అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** ఓట్ల సవరణ ప్రక్రియలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న నిర్వహించనున్న 'చలో లోక్‌భవన్' ర్యాలీకి పెద్ద ఎత్తున తరలిరావాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండియా కూటమి ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 8న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు భారీ ప్రదర్శన, అనంతరం సభ నిర్వహించనున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. కార్యక్రమంలో మిగతా2లో...

# రవాణా రంగానికి సమగ్ర ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఐటీఎల్ఏ జాతీయ స్థాయిలో రవాణా, లాజిస్టిక్స్ రంగాల సమగ్ర ప్రణాళికకు కేంద్ర సంస్థగా పనిచేయనుంది. రోడ్లు, రైల్వేలు, నౌకాశ్రయాలు, షిప్పింగ్, పౌర విమానయానం, అంతర్గత జలరవాణా, తీరప్రాంత రవాణా, పట్టణ రవాణా తదితర రంగాలను అనుసంధానిస్తూ పదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలానికి జాతీయ రవాణా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనుంది.

**భారీ ప్రాజెక్టులపై పర్యవేక్షణ** కేంద్ర ప్రభుత్వం చేపట్టే రూ.500 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వ్యయంతో కూడిన మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఐటీఎల్ఏ సాంకేతిక పరిశీలన నిర్వహించనుంది. ప్రాజెక్టుల అమలు సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయం చేయడంతో పాటు, పనులు పూర్తైన తర్వాత వాటి ప్రభావాన్ని కూడా అంచనా వేయనుంది. రవాణా, లాజిస్టిక్స్‌కు సంబంధించిన వివిధ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు జాతీయ రవాణా డేటా రిపాజిటరీని ఏర్పాటు చేయనున్నారు. జీఎస్టీఎన్ ఈ-వే బిల్లులు, ఫాస్టాగ్, వాహన్, జీపీఎస్ ఆధారిత వ్యవస్థలు, పట్టణ ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థల నుంచి సమాచారాన్ని సమీకరించి రవాణా ప్రణాళికలు, సరకు రవాణా మార్గాల విశ్లేషణకు వినియోగించనున్నారు.జాతీయ లాజిస్టిక్స్ విధానం-2022ను సమీక్షించడం, అవసరమైన మార్పులకు సూచనలు ఇవ్వడం, లాజిస్టిక్స్ రంగంలో శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం కూడా ఐటీఎల్ఏ బాధ్యతల్లో ఉండనున్నాయి. రవాణా వ్యవస్థను మరింత సమర్థవం తంగా మార్చడం, మల్టీమోడల్ అనుసంధానాన్ని బలోపేతం చేయడం, మౌలిక వసతుల సామర్థ్యాన్ని పెంచడం దీని ప్రధాన లక్ష్యాలుగా కేంద్రం పేర్కొంది.

# 8 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ భారం

(మొదటి పేజీ తరువాయి)

గతంలో ఇదే సమయంలో రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లుగా ఉండేదని, ప్రస్తుతం అది దాదాపు 20 వేల మెగావాట్లకు చేరిందని చెప్పారు. ఒకవైపు విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడం, మరోవైపు జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడం వల్ల విద్యుత్ రంగంపై అదనపు భారం పడిందన్నారు. **4 వేల మెగావాట్లు తగ్గిన జలవిద్యుత్**వర్షాభావ పరిస్థితుల కారణంగా నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు 4 వేల మెగావాట్లు తగ్గిందని భట్టి విక్రమార్క వివరించారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ పెరిగిన డిమాండ్‌ను ఇతర మార్గాల ద్వారా భర్తీ చేస్తూ రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు. మొత్తంగా 8 వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికీ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలు సమర్థంగా పనిచేస్తూ నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నాయని తెలిపారు.రాబోయే రోజుల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని భట్టి పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. విద్యుత్ రంగంలో నిరంతరం శ్రమిస్తున్న జెన్‌కో సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.**పులిచింతలలో 70 శాతం తగ్గిన ఉత్పత్తి** పులిచింతల ప్రాజెక్టుకు 120 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సాధారణ పరిస్థితుల్లో ప్రతి ఏడాది సుమారు 4 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కావాల్సి ఉంటుందని, అయితే ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా జలవిద్యుదుత్పత్తి 70 శాతం వరకు తగ్గిందని వివరించారు. నీటి లభ్యత తగ్గడం విద్యుదుత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు.ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు పూర్తిస్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. గతంలో పలు కారణాలతో తొలగించిన కాంట్రాక్టు సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకుని, వారిని క్రమబద్ధీకరిస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో సామాజిక న్యాయం, అభివృద్ధి కోసం సామాజిక అభివృద్ధి నిధుల కింద నిధులు మంజూరు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అంగీకరించారు. **రూ.9.6 కోట్లతో సామాజిక వంటశాల** మునగాల మండలం ఎస్‌ఎం పేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం రూ.9.6 కోట్లతో నిర్మించనున్న కేంద్రీకృత సామాజిక వంటశాలకు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి శంకుస్థాపన చేశారు. ఈ వంటశాల ద్వారా 1,020 పాఠశాలల్లోని దాదాపు 60 వేల మంది విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన వేడి అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయాన్నే అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగంగా కేంద్రీకృత వంటశాలల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. అలాగే గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత గురుకుల పాఠశాల పనులను కూడా ఉప ముఖ్యమంత్రి, మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్, ఎస్పీ నరసింహ, పులిచింతల జెన్‌కో ఎస్‌ఈ దేశ్య నాయక్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కరువు పరిస్థితులపై నివేదిక ఇవ్వండి

**320 మండలాల్లో ఎల్‌నినో ప్రభావం**

**12 ప్రామాణికాలతో మండలాల గుర్తింపు : సీఎస్ సంజయ్ జాజు**



**హైదరాబాద్,అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులపై సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. కరువు పరిస్థితులపై ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భజల వనరులు, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా తదితర శాఖల నుంచి సమగ్ర వివరాలను సేకరించాలని సంజయ్ జాజు సూచించారు. నిబంధనల ప్రకారం కరువు ప్రభావిత మండలాలను గుర్తించే ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు.జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగిన నైరుతి రుతుపవనాల కాలంలో నమోదైన వర్షపాతంతో పాటు మొత్తం 12 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర కరువు నివేదిక రూపొందించాలని సీఎస్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా కరువు ప్రభావిత మండలాలను ప్రకటించే ప్రక్రియను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కరువు పరిస్థితులకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను ఈ నెలాఖరులోగా సిద్ధం చేయాలని సంజయ్ జాజు స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో, ఆ సమావేశానికి అవసరమైన అన్ని వివరాలతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులను కోరారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శులు దాసరి హరిచందన, గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

# చలో లోక్‌భవన్ ర్యాలీకి తరలిరండి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌తో పాటు ఇండియా కూటమికి చెందిన వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు. ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై విపక్షాలు లేవనెత్తుతున్న అభ్యంతరాల నేపథ్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఇండియా కూటమి నేతలు తెలిపారు.

# క్రిశాంక్ అరెస్టుపై కెటీఆర్ ఆగ్రహం



**ఆధారాలతో ప్రశ్నిస్తే జైలుకు పంపుతారా?**

**రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్,అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అరెస్టుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు తీవ్రంగా స్పందించారు. అనుముల కుటుంబానికి సంబంధించిన అవినీతి ఆరోపణలపై ఆధారాలతో ప్రశ్నించినందుకే క్రిశాంక్‌ను అక్రమంగా అరెస్టు చేయించారని కెటీఆర్ ఆరోపించారు. ఎవరిపై పడితే వారిపై నిరాధార ఆరోపణలు చేసే వారికి ఒక న్యాయం, ఆధారాలతో ప్రశ్నించే ప్రతిపక్ష నేతలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కూడా కెటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి ఢిల్లీలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ తెలంగాణలో జరుగుతున్న పరిణామాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా అప్రజాస్వామిక పాలన కొనసా గుతోందని ఆయన ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు.ఇదిలా ఉండగా, మన్నె క్రిశాంక్‌ను మంగళవారం గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబంపై ఆరోపణలతో కూడిన బ్యానర్లు, ప్రచార సామగ్రి ఏర్పాటు చేశారన్న ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు అనంతరం క్రిశాంక్‌ను వైద్య పరీక్షల కోసం గాంధీ ఆసుపత్రికి తరలించి, అనంతరం కోర్టులో హాజరుపరిచారు.కాగా, క్రిశాంక్ అరెస్టుకు సంబంధించిన రిమాండ్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించడంతో ఆయనకు ఊరట లభించింది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, ప్రతిపక్ష నేతలను ప్రశ్నించినందుకు కేసులు, అరెస్టులతో అణచివేయడం సరికాదని పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

(మొదటి పేజీ తరువాయి)

వరకు మార్చ్ నిర్వహించారు. 'ఓట్ చోర్.. గద్దీ చోడ్' అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.ఈ మార్చ్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, సీపీఐ(ఎం) నేతలు అమ్రారామ్, జాన్ బ్రిట్టాస్, ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే, ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి మార్చ్‌ను అడ్డుకున్నారు. దీంతో ఎంపీలు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. బారికేడ్లు దాటి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరిని ఈడ్చుకెళ్లి పోలీసు వాహనాల్లోకి ఎక్కించారని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. సీపీఐ(ఎం) ఎంపీ ఎ.ఎ. రహీం గాయపడినట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. **ఓటు హక్కును కాపాడాలి**'ఎస్ఐఆర్' పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఇండియా బ్లాక్ నేతలు ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని లేదా ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరారు.సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సీఈసీ విశ్వసనీయతను కోల్పోయిందని విమర్శించారు. ఎంపీలను అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు.రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం కార్యాలయానికి కొద్దిదూరంలో ఉన్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆందోళన నేపథ్యంలో ఢిల్లీలో భారీగా పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలను మోహరించారు. పలు ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు. ఇండియా బ్లాక్ నేతలు మాత్రం తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆపరేశ్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. 2025 జూలై 19న తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.
జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్‌తో పాటు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.

# శ్రీశైలం శరన్నవరాత్రులకు చంద్రబాబుకు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

తీర్థప్రసాదాలను అందజేశారు.శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భ్రమరాంబికా అమ్మవారు ప్రతిరోజూ ఒక్కో విశేష అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో దేవస్థానం చేపడుతున్న ఏర్పాట్లపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై కూడా వివరాలు తెలుసుకున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఈవో, వేద పండితులు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆయన నివాసంలో కలిసి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాలకు హాజరుకావాలని లోకేష్‌ను కూడా వారు కోరారు.

# ఎర్రవల్లిలో 45 ఎకరాలు ఏమయ్యాయి?

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించారు. దీంతో 45 ఎకరాల భూమి ఎక్కడికి వెళ్లిందో తేల్చాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించారు.సర్వే నంబర్ 325 పరిధిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన భూములు ఉన్న నేపథ్యంలో, సంబంధిత భూముల రెవెన్యూ రికార్డులు, ఇతర పత్రాలను సమర్పించాల్సిందిగా కేసీఆర్ కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.**అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు**సర్వే నంబర్ 325లో గుర్తించే భూమిని అర్హులైన స్థానిక పేద రైతులకు పంపిణీ చేయాలని సీఎం సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అన్ని మౌలిక వసతులతో 'తెలంగాణ అమరవీరుల కాలనీ' నిర్మించాలని ఆదేశించారు. ఈ కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించి, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు.భూముల సరిహద్దులు, హక్కులు, రెవెన్యూ రికార్డులపై పూర్తి స్పష్టత వచ్చేలా సమగ్రంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# విద్యుత్ చార్జీలు పెంచొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.5,420 కోట్ల భారాన్ని ప్రజలపై మోపాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.ప్రజలు ఎల్‌నినో, ధరల పెరుగుదల, తాగునీటి సమస్యలు, విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వ విధానాల వల్ల సంక్షోభం ఏర్పడిందని ఆరోపించారు. గతంలో 201617 నుంచి 202122 వరకు రూ.12,718.40 కోట్ల ట్రూఅప్ చార్జీలను వినియోగదారులపై వేయాలని ఈఆర్‌సీ సూచించినప్పటికీ అప్పటి ప్రభుత్వం అంగీకరించలేదని గుర్తు చేశారు.విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టే ఉద్యమానికి సీపీఐ(ఎం), సీపీఐ కలిసి రావాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజా పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

# డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్నారని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణలో ఆశించిన ఫలితాలు సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గవర్నర్ సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని, గ్రామగ్రామాన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ప్రజలు, ప్రభుత్వం, పోలీసులు, మీడియా సమష్టి సహకారంతోనే 'నషాముక్త్ భారత్' లక్ష్యాన్ని సాధించగలమని శివప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు.కార్యక్రమానికి హాజరైన గవర్నర్‌కు మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ రఘునందన్‌రావు స్వాగతం పలికారు. అనంతరం స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను గవర్నర్ సందర్శించారు.

# కాకతీయ ప్రభుత్వ కళాశాలలో రెండు రోజుల అప్టిట్యూడ్ & రీజనింగ్ సెషన్ ముగింపు..

**హనుమకొండ, అక్టోబర్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండలోని టీఎస్‌కేసీ & ప్లేస్‌మెంట్ సెల్, టాస్క్ సహకారంతో నిర్వహించిన రెండు రోజుల అప్టిట్యూడ్ & రీజనింగ్ సెషన్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల సెమినార్ హాల్‌లో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. విద్యార్థులు అప్టిట్యూడ్, రీజనింగ్, అనలిటికల్ థింకింగ్ మరియు ప్రాబ్లమ్-సాల్వింగ్ స్కిల్స్ను నిరంతర సాధన ద్వారా అభివృద్ధి చేసుకోవాలని, పోటీ పరీక్షలు మరియు కార్పొరేట్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ నైపుణ్యాలు ఉపయోగపడతాయని ఆయన సూచించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. ఎ. అనిల్ కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, రెండు రోజుల శిక్షణలో విద్యార్థుల చురుకైన పాల్గొనడాన్ని అభినందించారు. కాంపిటేటివ్ ఎగ్జామినేషన్స్, హయ్యర్ ఎడ్యుకేషన్ మరియు కెరీర్ ఆపర్చునిటీస్ కోసం విద్యార్థులు నిరంతరం సాధన చేయాలని



సూచించారు. రాజేష్ జన్ను, సీఆర్‌టీ, టాస్క్ విద్యార్థులు ప్రతిరోజూ అప్టిట్యూడ్ & రీజనింగ్ ప్రశ్నలను సాధన చేసి స్పీడ్, అక్యూరసీ మరియు కాన్ఫిడెన్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్, ప్రొఫెసర్ శ్రీనాథ్, MOCCS కోఆర్డినేటర్ డా. శ్రీకాంత్, డా. చిన్నా, రవి కుమార్, వెంకన్న, డా. ఐ. శివనాగ శ్రీనివాస్, సాగర్ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. రెండు రోజుల శిక్షణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అప్టిట్యూడ్, రీజనింగ్, లాజికల్ థింకింగ్ మరియు ప్రాబ్లమ్-సాల్వింగ్ అంశాలలో ప్రాక్టికల్ శిక్షణ పొందారు.

# ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపును ఆపాలి

**- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని అఖిలపక్షాల ధర్నా**

**జవహర్‌నగర్, అక్టోబర్ 6 (పి సి డబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపిస్తూ కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్, టీజేఎస్, ఎస్పీ పార్టీల ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం అఖిలపక్షాల ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి అత్యంత కీలకమని, ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫారం-7 ద్వారా ఫిర్యాదు వచ్చినప్పుడు సంబంధిత ఓటరును సంప్రదించకుండా పేర్లు తొలగించరాదని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి,




ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఫారం-6కు సంబంధించిన నిబంధనలను పునఃపరిశీలించాలని, ఓటర్ల డేటా కేంద్రీకరణను నిలిపివేసి స్థానిక స్థాయిలో ఓటర్ల జాబితా నిర్వహణను పునరుద్ధరించాలని కోరారు. అలాగే ఓటర్ల డేటా సాఫ్ట్‌వేర్‌పై తటస్థ ఐటీ నిపుణులతో ఆడిట్ నిర్వహించాలని, ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేసి, ప్రధాన మంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ద్వారా నియామకాలు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కామ్రేడ్ గడ్డం సదానందం, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గుబ్బగుర్తి పాఠశాలలో వన్యప్రాణుల వారోత్సవాలు










**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 72వ వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, అడవుల ప్రాధాన్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దంతాల ప్రశాంతి నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివన్నారాయణ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జీ. ఉపేంద్రయ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి. సైదా, యు. అయోధ్యమ్మ, జ్యోతి, ఏఏపీసీ చైర్‌పర్సన్ నాగమణి పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయులు మురళీకృష్ణ, లలిత భారతి, వెంకటేశ్వర్లు, చారి, సుజాత, భాస్కర్తో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన్యప్రాణులు, అడవులు, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కార్యక్రమ నిర్వాహకులు ఉపేంద్రయ్య తెలిపారు.

# సఫాయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**● జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ వైస్ చైర్మన్ హర్దీప్ సింగ్ గిల్‌కు వినతి**



**హైదరాబాద్, అక్టోబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** సఫాయి కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోదా రామకృష్ణ కోరారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన భారత జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ వైస్ చైర్మన్ హర్దీప్ సింగ్ గిల్‌ను కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సఫాయి కార్మికులను కాంట్రాక్టు విధానం నుంచి తొలగించి, ప్రభుత్వమే నేరుగా నెలసరి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రధానంగా కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్ వైస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ వాల్మీకి, హైదరాబాద్ సిటీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ దేవేందర్ చిండాలియా తదితరులు పాల్గొన్నారు.

# హైటెన్షన్ వైర్ల షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు



**జోహార్ నగర్ అక్టోబర్ 6: (పిసిడబ్ల్యూ న్యూస్):** చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్‌సీఎల్ కేబుల్ చౌరస్తా, అశోక్‌నగర్ ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ వైర్ల షాక్‌తో రాంసింగ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు.. ఓ స్వీట్ హౌస్‌లో పనిచేస్తున్న రాంసింగ్, హైటెన్షన్ విద్యుత్ వైర్లకు సమీపంలో నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. విద్యుత్ వైర్లు ఒక్కసారిగా లాగడంతో షార్ట్‌సర్క్యూట్ సంభవించి, యువకుడి ఒంటికి మంటలు అంటుకున్నట్లు తెలుస్తోంది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. హైటెన్షన్ విద్యుత్ వైర్లకు సమీపంలో నిర్మాణ పనులు చేపట్టిన విషయం, భద్రతా నిబంధనల అమలు తదితర అంశాలపై అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది. ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటివరకు పూర్తి వివరాలను వెల్లడించలేదు. ప్రమాదానికి గల కారణాలు, బాధ్యుల వివరాలను అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ఘన విజయం

**● ఇంజనీర్ కోల అన్నారెడ్డికి ఘన సత్కారం**





**కరీంనగర్, అక్టోబర్ 6 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఇటీవల జరిగిన జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన ఇంజనీర్ కోల అన్నారెడ్డిని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137-ఏ కరీంనగర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కరీంనగర్‌లోని వాసుదేవ హాస్పిటల్‌లో ఈ సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డా. ఎలగందుల శ్రీనివాస్, జిల్లా గవర్నర్ కొంజర్ల మహేశ్, వి.డి.జి-2 సాగర్ రెడ్డి, శ్రవణ్, మహేంద్ర రెడ్డి, జిల్లా పీఆర్‌ఓ పుల్లాల శ్యామ్, ఈద కుమారస్వామి, గాలిపల్లి నాగేశ్వర్, చర్మల వెంకటేశ్వర్లు, సుధాపల్లి ప్రసాద్, పండగ నాగరాజు, అల్లాడి ఆనంద్ కుమార్, ఎస్పీ వెంకన్న, డా. జి. అశోక్, డా. రామకృష్ణ, డా. జీఎం కిరణ్, డా. శశికాంత్, డా. పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. వివిధ అలయన్స్ క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ అలయన్స్ క్లబ్ సభ్యులు, లైఫ్ మెంబర్లకు అత్యవసరంగా రక్తం అవసరమైనప్పుడు ఇంజనీర్ కోల అన్నారెడ్డిని, జిల్లా కార్యవర్గాన్ని సంప్రదించి రక్తసేవలు పొందవచ్చని తెలిపారు. అలయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహించి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత విస్తృతంగా సేవలు అందిస్తామని పేర్కొన్నారు. "సేవే లక్ష్యంరక్తదానం ప్రాణదానం" అనే స్ఫూర్తితో ప్రజలకు మరింత అంకితభావంతో సేవలందించాలని నాయకులు ఆకాంక్షించారు.

# తార్నా దళ్ బాబాజీ స్వాగత కార్యక్రమానికి పోలీస్ భద్రత కోరిన గురుద్వారా కమిటీ



**కరీంనగర్, అక్టోబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ గోవింద్ నగర్ సంగత్ ఆధ్వర్యంలో 15/10/2026న తార్నా దళ్ బాబాజీని ఘనంగా స్వాగతించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురుద్వారా సాహెబ్ గోవింద్ నగర్ ప్రబంధక్ కమిటీ తెలిపింది.ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఐపీఎస్ ను కలిసి కమిటీ ప్రతినిధులు తెలియజేశారు.కార్యక్రమానికి భక్తులు, సంగత్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన పోలీస్ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని ప్రబంధక్ కమిటీ పోలీస్ కమిషనర్‌ను ప్రత్యేకంగా కోరింది. కార్యక్రమం సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలీస్ భద్రత అందించాలని విజ్ఞప్తి చేసింది.తార్నా దళ్ బాబాజీ రాక సందర్భంగా గోవింద్ నగర్ సంగత్ ఆధ్వర్యంలో ఘన స్వాగత ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# భారతదేశం బాగుపడాలంటే అవినీతి నిర్మూలించాలి

## జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించి నూతన దేశాన్ని నిర్మించుకోవాలి

## ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వమే ఆదుకుంటుంది: పిడమర్తి రవి





**తల్లాడ, అక్టోబర్ 6 (పీసీడబ్ల్యూ న్యూస్):**భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే పూర్తిగా అవినీతిని నిర్మూలించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా తల్లాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా జ్ఞానేశ్‌కుమార్ బీజేపీతో కుమ్మక్కై సీఈసీని పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నూతన భారతదేశ నిర్మాణం కోసం దేశ పౌరులందరూ రోడ్డుపైకి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో బీజేపీ ఓడిపోతుందనే భయంతోనే డీలిమిటేషన్ పేరుతో స్థానాలను పెంచేందుకు ప్రధాని మోదీ ఆసక్తి చూపుతున్నారని ఆరోపించారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న భాగస్వామ్య పక్షాలు సైతం ఆయనకు దూరంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలోని ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం 2.50 గజాల స్థలాలను ఇస్తుందని పిడమర్తి రవి తెలిపారు. దేశంలో పరిస్థితులు వేగంగా మారుతున్నాయని, కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వచ్చి ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని అన్నారు.తొలుత తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం పిడమర్తి రవి లక్ష్మారెడ్డిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్, అన్నారుగూడెం గ్రామ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, నాయకులు రావుల గోపి గౌడ్, రేగళ్ల శ్రీనివాసరావు, నారపోగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ నోటీసుల హియరింగ్‌ను త్వరగా పూర్తి చేయాలి...



**కరీంనగర్, అక్టోబర్06(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల హియరింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయా దేవి అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఓటరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని ఆమె పరిశీలించారు. పక్కా ప్రణాళికతో ఎస్ఐఆర్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్న జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.హియరింగ్‌కు హాజరుకాని ఓటర్లను బీఎల్‌ఓలు మరోసారి సంప్రదించి అవసరమైన పత్రాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నోటీసులపై తదుపరి చర్యల్లో ఎలాంటి జాప్యం లేకుండా ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తెలిపారు.కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పరిశీలన, పత్రాల సేకరణ, దరఖాస్తుల పరిష్కారం చేపడుతున్నారని వివరించారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, డి. శ్రీనివాస్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో షర్మిల, తహసీల్దార్లు, ఏఈఆర్వోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

## చైర్మన్‌గా సంగెం లక్ష్మణరావు ఎన్నిక





**కరీంనగర్, అక్టోబర్ 6 (పీసీడబ్ల్యూ న్యూస్):**ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారు. డిప్యూటీ కోఆపరేటివ్ ఆఫీసర్ సమక్షంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. చైర్మన్‌గా సంగెం లక్ష్మణరావు, వైస్ చైర్మన్‌గా వుట్కూరి రాధాకృష్ణారెడ్డి, చీఫ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా పెంద్యాల కేశవరెడ్డి, స్టేట్ ఈసీ మెంబర్‌గా కుందారపు మహేశ్వర్, కోశాధికారిగా గోనె శ్రీనివాస్, యూత్ కోఆర్డినేటర్‌గా మొగలోజు రాకేష్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా కోల అన్నారెడ్డి, పెద్ది విద్యాసాగర్, చిదుర సురేష్, పి. శ్రీహరి రెడ్డి, రాగి శ్రీనివాస్, సాయిని నరేందర్, హనుమాండ్ల రాజిరెడ్డి, కాస్పర్తి మనోహర్ రావు, ఎలుగందల మునీందర్ ఎన్నికయ్యారు.ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, జేఏసీ కన్వీనర్, టీజీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఐఏఎస్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఐపీఎస్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు, స్వీట్లు అందించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ, డీఆర్‌ఓలను కలిసి కార్యవర్గాన్ని పరిచయం చేసుకున్నారు.ఈ సందర్భంగా చైర్మన్ సంగెం లక్ష్మణరావు మాట్లాడుతూ తమ ఎన్నికలో ఉద్యోగుల జేఏసీ నాయకులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను పాటిస్తూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆశయాలకు అనుగుణంగా మానవతా సేవలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు.నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు, విపత్తుల సమయ ంలో సహాయక చర్యలు, ఆరోగ్య సేవలు, యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సేవలను జిల్లాలోని అన్ని వర్గాలకు మరింత చేరువ చేసేందుకు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

# రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

## - కార్యదర్శిగా నల్లగట్ల కృష్ణ



**తల్లాడ, అక్టోబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్)** :తల్లాడ మండల రేషన్ డీలర్ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల రేషన్ డీలర్ల కార్యవర్గ సమావేశం నాయకోటి రాజు అధ్యక్షతన, ఖమ్మం జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు డి దర్గయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా పత్తిపాటి ఏసోబు, అధ్యక్షుడిగా తూము నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా మేడేపల్లి వెంకటాచారి, మండల సెక్రటరీగా నల్లగట్ల కృష్ణ, కోశాధికారిగా బానోతు బాలకృష్ణ, మహిళా ప్రతినిధిగా రాయల బిందుమాధవి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన సెక్రటరీ నల్లగట్ల కృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన ఖమ్మం జిల్లా అధ్యక్షుడు డి.దర్గయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రేషన్ డీలర్లు టి.బాబు, రామారావు, మణికంఠ, మాన్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కరీంనగర్‌లో ఇండియా కూటమి గర్జన

## ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ






**కరీంనగర్, అక్టోబర్ 6 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజాస్వామ్య పరిరక్షణ వారంలో భాగంగా సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు, ఓట్ల తొలగింపును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, వోడితల ప్రణవ్‌బాబు, ఊట్కూరు నరేందర్‌రెడ్డి, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు అంబటి జోజిరెడ్డి, బండారి శేఖర్, సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) జిల్లా కార్యదర్శి జిన్నం ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాస్ నాయక్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడుకోవడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం బీజేపీకి అనుబంధ విభాగంగా మారిందని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అణగారిన వర్గాల ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ జరిపించాలని, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసే విధంగా సీఈసీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించి, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ సీఈసీని బర్తరఫ్ చేయాలని కోరగా, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించే వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు.అనంతరం సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని కోరుతూ ఇండియా కూటమి నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రతి ఓటరుకు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖమ్మం నగరానికి మరో ఆధ్యాత్మిక శోభ

- టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ..
- చిన్న జీయర్ స్వామికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆహ్వానం



**హైదరాబాద్, ప్రతినిధి అక్టోబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఖమ్మం నగరానికి మరో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఈ నెల 12వ తేదీన భూమిపూజ నిర్వహించనున్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, అంగరంగ వైభవంగా జరగనున్న ఈ పవిత్ర కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు ఆహ్వానించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ గారు పాల్గొన్నారు.టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శుభారంభం కానున్న ఈ భూమిపూజ కార్యక్రమం ఖమ్మం నగర ఆధ్యాత్మిక చరిత్రలో ఒక విశిష్ట ఘట్టంగా నిలవనుంది. శ్రీవారి ఆలయం నిర్మాణంతో ఖమ్మం నగరానికి మరింత ఆధ్యాత్మిక ప్రాధాన్యత లభించడంతో పాటు, భక్తులకు శ్రీవారి దర్శనానికి సౌకర్యం కలగనుంది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగ్యూ, మలేరియా జ్వరాల భయాందోళనలు!

**జ్వరాలతో ఆసుపత్రికి క్యూ కడుతున్న ప్రజలు.. పారిశుద్ధ్యంపై ఆందోళన దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్**

**ఏటూరునాగారం, అక్టోబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి జ్వరాలతో వచ్చే రోగుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రజల్లో డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలపై భయాందోళనలు నెలకొంటున్నాయి. వర్షాకాలం ప్రభావంతో పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడం, దోమల సంఖ్య పెరగడంతో జ్వరాల వ్యాప్తిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఏటూరునాగారం మండలంలోని పలు గ్రామాల నుంచి జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసం తదితర లక్షణాలతో ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సాధారణ జ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులపై ప్రజల్లో భయం నెలకొంది. అయితే ప్రతి జ్వరం డెంగ్యూ లేదా మలేరియా అని నిర్ధారించలేమని, అవసరమైన పరీక్షలు నిర్వహించిన తర్వాతే వ్యాధిని నిర్ధారించాల్సి ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

**పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం** మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





డ్రైనేజీలలో మురుగునీరు నిలవకుండా చూడడంతో పాటు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.దోమల బెడద పెరగకుండా గ్రామాల్లో ఫాగింగ్, దోమల మందు పిచికారీ, నిల్వ నీటి తొలగింపు వంటి చర్యలను విస్తృతంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ముందస్తు పరీక్షలు నిర్వహించాలి** డెంగ్యూ, మలేరియా అనుమానిత లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన పరీక్షలు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని, అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.మండలంలోని పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేసి, నిల్వ నీటిని తొలగించి, అవసరమైన చోట ఫాగింగ్ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజల్లో అవగాహన కల్పించాలి** డెంగ్యూ, మలేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరూ స్వయంగా మందులు వాడకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఏటూరునాగారం మండలంలో జ్వరాలపై ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచడంతో పాటు దోమల నియంత్రణ చర్యలను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆర్టీసీ వర్క్‌షాప్ యూనియన్ అధ్యక్షులుగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్

- అక్టోబర్ 9న కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి





**కరీంనగర్, అక్టోబర్ 6 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ ఆర్టీసీ వర్క్‌షాప్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యూయూ, టీడబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ అనుబంధ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది.ఈ సందర్భంగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో టీఆర్ రెడ్డి రాజు, పొన్నం శ్రీనివాస్ గౌడ్, సురేష్ గౌడ్, అంజన్నతో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# హాస్పిటల్ నిర్మాణ పనుల నాణ్యతపై స్థానికుల అనుమానాలు

- నిబంధనల ప్రకారం పనులు జరుగుతున్నాయా?

**అధికారుల తనిఖీ చేయాలని డిమాండ్**



**ఏటూరునాగారం, అక్టోబర్ 6 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న హాస్పిటల్ భవన పనుల నాణ్యతపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బేస్‌మెంట్, ఫౌండేషన్ పనుల్లో నాణ్యత లేని మట్టి, ఇసుకను వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ ప్రదేశంలో భారీగా మట్టి పేరుకుపోవడంతో పాటు కొన్ని చోట్ల నీరు నిలిచినట్లు స్థానికులు చెబుతున్నారు.ఫౌండేషన్ చుట్టూ మట్టి, ఇసుకను పొరల వారీగా నింపి, నిబంధనల ప్రకారం కాంపాక్షన్ చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియపై స్పష్టత లేదని వారు పేర్కొన్నారు. సరైన కాంపాక్షన్ లేకుండా పనులు కొనసాగితే భవిష్యత్తులో నేల సెటిల్‌మెంట్, గోడలకు పగుళ్ల వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా ఆర్సీసీ పనుల్లో స్టీల్ రాడ్ల అమరిక, కాంక్రీట్ మిశ్రమం, రీన్ఫోర్స్‌మెంట్, కాంక్రీట్ కవర్, క్యూరింగ్ తదితర అంశాలను ఇంజినీరింగ్ ప్రమాణాల ప్రకారం పాటిస్తున్నారా అనే విషయంపై కూడా స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ప్రభుత్వ హాస్పిటల్ భవనం కావడంతో నిర్మాణ నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి మట్టి, ఇసుక, కాంక్రీట్, స్టీల్ నాణ్యతతో పాటు కాంపాక్షన్, క్యూరింగ్ ప్రక్రియలను సాంకేతికంగా పరిశీలించి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# జాకారం జాతీయ రహదారిపై వెలుగులు

**- ఎట్టకేలకు నెరవేరిన సెంట్రల్ లైటింగ్ కల.. ప్రమాదాల నివారణకు దోహదం**

**ములుగు, అక్టోబర్ 6 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా జాకారం గ్రామంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను గ్రామ సర్పంచ్ దాసరి సమత రమేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ప్రారంభించారు. గ్రామస్థుల చిరకాల కోరిక నెరవేరడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో వెలుతురు లేక



వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలు మరింత సురక్షితంగా మారుతాయని గ్రామస్థులు తెలిపారు. చీకటి కారణంగా జరిగే ప్రమాదాలను నివారించడంలో లైటింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని సర్పంచ్ దాసరి సమత రమేష్ పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినందుకు సర్పంచ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# గురుకుల విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం

**- నేలకొండపల్లి గురుకులానికి పూర్వ వైభవం రావాలి**

**- క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్న పాఠశాలకు అండగా పేరెంట్స్ కమిటీ**

**- అవసరాలు తీర్చి.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో నడిస్తే మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధ్యం**

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్ర వేదికగా నేలకొండపల్లి గురుకుల పాఠశాల మరింత అభివృద్ధి చెందాలని, ఇక్కడ చదువుతున్న ప్రతి విద్యార్థినీ ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా విద్య, క్రమశిక్షణతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గురుకుల పేరెంట్స్ కమిటీ పేర్కొంది. పాఠశాలపై వచ్చే ఆరోపణలు, అపోహల కంటే విద్యార్థుల భవిష్యత్తుకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరింది.నేలకొండపల్లి గురుకుల పాఠశాలలో మంగళవారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గురుకులంలో చదువుతున్న విద్యార్థినులకు మంచి విద్యను అందిస్తూ, క్రమశిక్షణతో ముందుకు తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. గతంలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలను ఆధారంగా చేసుకుని పాఠశాలకు చెడ్డపేరు వచ్చేలా ప్రచారం చేయడం వల్ల చివరికి నష్టపోయేది విద్యార్థులేనని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తు... రాజకీయాలు, వ్యక్తిగత విభేదాలకు వేదిక కాకూడదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల మధ్య ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే వాటిని పాఠశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడం, వారి ప్రతిభను వెలికితీయడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన





తాగునీరు, పారిశుధ్యం, వసతి, భద్రత, విద్యా సామగ్రి, క్రీడా సదుపాయాలు తదితర మౌలిక అవసరాలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు పేరెంట్స్ కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.పాఠశాలలోని వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులతో సమగ్రంగా మాట్లాడి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి ఆటంకం కలిగించే అంశాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరనున్నట్లు చెప్పారు.ఒక చిన్నారి మంచి భవిష్యత్తు కోసం గురుకులంలో అడుగుపెడుతుంది.. ఆ నమ్మకాన్ని నిలబెట్టడం అందరి బాధ్యత అని పేరెంట్స్ కమిటీ సభ్యులు అన్నారు. విద్యార్థినుల చదువుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించి, క్రమశిక్షణతో పాటు విద్యా ప్రమాణాలను మరింత పెంచి, రాబోయే రోజుల్లో పాఠశాల నుంచి మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు. కావాలనే కొందరు విద్యార్థి సంఘనాయకులతో సమస్యలను సృష్టిస్తే వారిపై గురుకుల సెక్రటరీ, జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జి. నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ప్రశాంతి, పేరెంట్స్ కమిటీ సభ్యులు బొడ్డు మల్లయ్య, భూక్య సుధాకర్, బొడ్డు నాగరాజు, పెదపాక సైదులు, భూక్య అమీన్, ఊటుకూరు లక్ష్మణ్, డి. శ్రీనివాసరావు, తంగిరాల నరసింహారావు, జి. ఉపేందర్ పాల్గొన్నారు.

# ములుగు మున్సిపాలిటీలో దసరా ఖర్చులపై ఆరోపణలు

- రూ.11 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చులపై 7వ వార్డు కౌన్సిలర్ బైకాని సునీత ఓదెలు ప్రశ్నలు




**ములుగు, అక్టోబర్ 6 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు మున్సిపాలిటీలో దసరా ఖర్చుల పేరుతో భారీగా నిధులు వెచ్చిస్తున్నారంటూ 7వ వార్డు కౌన్సిలర్ బైకాని సునీత ఓదెలు మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌పై ఆరోపణలు చేశారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం రూ.లక్షకు మించి ఖర్చులకు టెండర్ ప్రక్రియ, కౌన్సిల్ తీర్మానం అవసరమని, అయితే అవి లేకుండానే రూ.11 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చులు చేస్తున్నారని ఆమె ఆరోపించారు.మిగతా కౌన్సిలర్లకు సమాచారం లేకుండా తోపుకుంట కట్ట వద్ద ఆర్చ్ గేటు నిర్మాణం చేపట్టారని, దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి వీధి దీపాలకు లైట్లు, క్లాంపులు అడిగినా పట్టించుకోని అధికారులు దసరా పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేయడంపై ఆమె ప్రశ్నించారు.తన వార్డులోని మాధవరావుపల్లిలో తీవ్ర నీటి సమస్య ఉందని, బోరు వేయాలని పలుమార్లు కోరినా స్పందించలేదన్నారు. మున్సిపల్ కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం, మరోవైపు దసరా ఖర్చులకు నిధులు వెచ్చించడం ఏమిటని ప్రశ్నించారు. పన్నుల పెంపుపైనా అనుమానాలు వ్యక్తం చేస్తూ, మున్సిపాలిటీలో జరుగుతున్న వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ కోరారు.

# నకిలీ వాట్సాప్ సందేశాలకు స్పందించొద్దు

- ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు







**ములుగు జిల్లా, అక్టోబర్ 6 (పీసీడబ్ల్యూ న్యూస్):** తన పేరు, ఫొటోను ఉపయోగించి గుర్తుతెలియని వ్యక్తులు పంపుతున్న నకిలీ వాట్సాప్ సందేశాలకు ఎవరూ స్పందించవద్దని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మం గళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన పేరు, ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని ఒక గుర్తుతెలియని నంబర్ నుంచి అధికారులకు సందేశాలు పంపుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఆ నంబర్ నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దని, వెంటనే బ్లాక్ చేసి వాట్సాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అపరిచిత నంబర్ల నుంచి వచ్చే సందేశాల ద్వారా డబ్బులు, బహుమతి కార్డులు అడిగినా స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, రహస్య సంకేత సంఖ్యలను ఎవరికీ ఇవ్వవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. తన పేరుతో అనుమానాస్పద సందేశాలు వస్తే సైబర్ నేరాల విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్ నేరగాళ్లు ప్రముఖుల పేర్లు, ఫొటోలను ఉపయోగించి మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

# డీడీలు కట్టినా కనెక్షన్లు ఇవ్వరు!

- రూ.2 లక్షలు వసూలు చేశారంటూ ఫిర్యాదు.. 14 రోజులు కరెంట్ లేక పంట ఎండిపోయిందన్న రైతు





**కల్లూరు, అక్టోబర్ 6 (పీసీడబ్ల్యూ న్యూస్):** విద్యుత్ శాఖ సిబ్బంది, ప్రైవేటు వ్యక్తుల తీరుపై రైతులు, వినియోగదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లిస్తేనే విద్యుత్ పనులు చేస్తున్నారని, డీడీలు కట్టినా వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వకుండా తిప్పుతున్నారని సీజీఆర్ఎఫ్ సదస్సులో ఫిర్యాదు చేశారు. కల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కల్లూరు, పెనుబల్లి, లంకాసాగర్ సెక్షన్ల వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మంగళవారం సదస్సు నిర్వహించారు. ముద్దునూరు గ్రామానికి చెందిన రైతు మాట్లాడుతూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రెండు మోటార్లు 14 రోజులపాటు పనిచేయలేదని, దీంతో రెండెకరాల మొక్కజొన్న పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాన్ని అధికారులు పరిశీలించి ధ్రువీకరించినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. యజ్ఞనారాయణపురంలో ఎనిమిది మంది రైతుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.25 వేల చొప్పున రూ.2 లక్షలు వసూలు చేసి వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వలేదని ఉపసర్పంచ్ రావి సూర్యనారాయణ ఆరోపించారు. ఏఈ, డీఈల పేర్లు చెబుతూ ప్రైవేటు వ్యక్తి డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేయగా, సంబంధిత లైన్‌మెన్, ప్రైవేటు వ్యక్తిని పిలిపించాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ కే. మాధవరావు ఆదేశించారు. విద్యుత్ తీగల కారణంగా గేదె మృతి చెందగా, పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్న వృద్ధుడిని ఐదు నెలలు తిప్పారని కమిటీ సభ్యుడు ఎం. రామారావు తెలిపారు. దీనిపై ఆయన అధికారులను ప్రశ్నించారు. విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ చెల్లించిన తర్వాత శాఖాపరంగా ఏర్పాట్లు చేసి కనెక్షన్ ఇవ్వాల్సిందేనని చైర్మన్ మాధవరావు స్పష్టం చేశారు. ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా ఇబ్బంది పెడితే 1912కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అవినీతి ఆరోపణలు రుజువైతే విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రామడుగు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు విజయవంతం






**రామడుగు, అక్టోబర్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ మరియు పాలకవర్గం వార్డు సభ్యులు ఆధ్వర్యంలో వరుణ్ హాస్పిటల్ కరీంనగర్ వారి సౌజన్యంతో రామడుగు గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇట్టి వైద్య శిబిరం లో దాదాపు 200 మందికి పైగా కంటి పరీక్షలు చేసుకోవడం జరిగింది. ఇట్టి వైద్య శిబిరం నిర్వహించినందుకు గ్రామస్తులు హాస్పిటల్ యాజమాన్యానికి,గ్రామ పంచాయతీ పాలకవర్గం కు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహమ్మద్ మొహిజ్ గారు ఉప సర్పంచ్ పెండోట రాజు గారు మరియు పాలకవర్గం వార్డు సభ్యులు మామిడి దిలీప్ కుమార్, కర్నె శ్రీలత - శ్రీనివాస్,ఎండీ ఆరీఫ్,సిరికొండ పల్లవి - సాయి తేజ, మ్యాడారం అర్చన - అనిల్,నీలం అరుణ - లక్ష్మణ్,రాగం స్వప్న - రవి,సామంతుల సుజాత - తిరుపతి,కారుపాకల నరేష్,మామిడి శ్రవణ్,చంద అనిల్, మామిడి కుమార్, సిరిగిరి వెంకటేశం మరియు హాస్పిటల్ యాజమాన్యం,గ్రామస్తులు పాల్గొన్నారు.

# రామడుగు గడ్డపై కాషాయ జెండా ఎగవేస్తాం..

- సురేష్ ఆత్మరం మహారాజ్..
కొండగట్టు గిరి ప్రదక్షిణ స్థాపకులు..



**రామడుగు, అక్టోబర్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈరోజు స్థానిక రామడుగు కేంద్రం వైశ్య భవన్ లో హిందూ శంఖారావం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వన్నారం అక్షయ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి స్వామి వివేకానంద కి పూలమాలవేసి స్థానిక చత్రపతి శివాజీ విగ్రహానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొండగట్టు గిరిప్రదక్షిణ స్థాపకులు సురేష్ ఆత్మారం మహారాజ్ పాలభిషేకం మరియు పూలమాల సమర్పించి పెద్ద ఎత్తున ర్యాలీగా వైశ్య భవన్ వచ్చి జ్యోతి ప్రజ్వలన చేసి హనుమాన్ కి ఫల పంచామృతాలు అభిషేకం చేసి కార్యక్రమం ని స్థాపించారు.. ఈ సందర్భంగా కొండగట్టు గిరిప్రదక్షిణ స్థాపకులు సురేష్ ఆత్మారావు మహారాజ్ మాట్లాడుతూ ఇది రాముడు ఏలి అడిగేసిన నేలని ఇక్కడ కాషాయజండా ఎగరేస్తామని కాషాయ జెండా ఎగరేసే వరకు విశ్రమించబోనని హిందువులలో ఈ గడ్డపై చైతన్యం రావాలని ఈ గడ్డపై కాషాయం ఎగరాలంటే ప్రతి ఒక్కరూ కులాలకు అతీతంగా హిందువులుగా ఒకటిగా జీవించాలని విడిపోతే పడిపోతామని కలిసి ఉంటేనే ఈ గడ్డపై రామరాజ్యం వస్తుందని తెలిపారు ఆంజనేయ స్వామి ప్రత్యక్షంగా రాముడు అడిగేసిన నేలపై నన్ను కాషాయ జండా ఎగరేలా చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మేకల ప్రభాకర్, మోడీ రవీందర్ పేరుకా శ్రావణ్ శివాజీ సేన రాష్ట్ర అధ్యక్షులు తోట మధుకర్ మహిళా వక్త గుల్లపల్లి త్రివేణి మామిడిపల్లి కృష్ణ చైతన్య కలిగేటి ఎల్లయ్య, వేముల రమేష్, మాదం శివ మాడిశెట్టి అనిల్ ఎడవల్లి మహిపాల్ రెడ్డి పందికుంటపల్లి ఉపసర్పంచ్ బీర్ల వినోద్ సిరిపురం సాగర్, పూరెల్లా రాజశేఖర్, కరుటపల్లి గ్రామ సర్పంచ్ మేకల మహేశ్వరి రాజేందర్, ఆకుల మనోహర్, శివాజీ సేన జిల్లా ఉపాధ్యక్షులు గుండె వెంకటేష్ జిల్లా ట్రెజరర్ రేగురి దిలీప్ జిల్లా ప్రాచర కార్యదర్శి కారుపాకల నరేష్ రామడుగు మండల అధ్యక్షులు ఎడవల్లి లక్ష్మణ్ చొప్పదండి మండల అధ్యక్షులు రామడుగు రవి మండల ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు వీర్ల మండల ఉపాధ్యక్షులు జాడి వంశీ వెలిచాల గ్రామ శాఖ అధ్యక్షులు వంగ నరేందర్ రామడుగు గ్రామ అధ్యక్షుడు ఉత్తం సాయి, రాగంపేట గ్రామ అధ్యక్షులు రాచకొండ ఉమేష్, రామకృష్ణ కట్ట దిలీప్ కట్టెకుల మహేష్ వారాల మనోహర్ బీర్ల రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# లింగ వివక్ష నిర్మూలనకు సమూలంగా మార్పులు రావాలి

- తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక కన్వీనర్ పారుపల్లి ఝాన్సీ




**కల్లూరు, అక్టోబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దసరా నవరాత్రులు మహిళను శక్తి స్వరూపిణిగా, దుర్గామాతగా కొలుస్తున్నాము. కానీ నిజ జీవితంలో సమాజంలో సగభాగమైన మహిళలు నేటికీ అనేక వివక్షలను ఎదుర్కొంటున్నారని, మహిళా అభ్యుదయం లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదని పారుపల్లి ఝాన్సీ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం లింగ వివక్షత నిర్మూలన అనే అంశంపై నిర్వహించిన సెమినార్ లెక్చరర్ షకీలా భాను అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ మనం ఎంత టెక్నాలజీ యుగంలో ఉన్నా, మహిళలు పురుషులతో సమానంగా సమానత్వాన్ని, సమాన హక్కులను పొందలేకపోతున్నారు. కుటుంబం నుంచి, సమాజం నుంచి, ప్రభుత్వం నుంచి మహిళలు అనేక రకాలైన లింగ వివక్ష, ఆర్థిక, సామాజిక, రాజకీయ వివక్షలను ఎదుర్కొంటున్నారు. మహిళా వివక్ష తొలగాలంటే, లింగ వివక్ష తొలగాలంటే కేవలం పండుగల్లో పూజలు చేస్తే సరిపోదు. కుటుంబం నుంచి, సమాజం నుంచి, ప్రభుత్వ విధానాల నుంచి సమూలమైన మార్పులు రావాల్సిన అవసరం ఉందని సెమినార్ లో తీర్మానించడం జరిగింది. విద్యార్థులు బాగా చదువుకోవడం ద్వారానే చైతన్యవంతులు అవుతారు. విద్యయే వివక్షకు వ్యతిరేకంగా పోరాడే ఆయుధం అన్నారు. మహిళలను చిన్నప్పటి నుంచే గౌరవించే సంస్కృతిని కుటుంబాల్లో అలవరచాలి. అప్పుడే సమాజం నిజంగా అభివృద్ధి చెందుతుంది.-సమాన అవకాశాలు: విద్య, ఉపాధి, ఆస్తి హక్కు, రాజకీయాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలిఅన్నారు .లింగ వివక్షను తొలగించుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి మహిళలనుశక్తి స్వరూపణలుగా గుడిలోనే కాకుండా నిజ జీవితంలో కూడా గౌరవించాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఐద్వా సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపాల్ వేముల శేఖర్, లెక్చరర్స్ షకీలా భాను,, ప్రసన్న, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్ ఈ బి.బిక్షపతి

- విద్యుత్ సరఫరా పరిస్థితిపై అధికారులతో సమీక్ష



**ములుగు జిల్లా నర్సాపూర్ అక్టోబర్(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ వినియోగదారులకు నాణ్యమైన, విశ్వసనీయ విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలని ఎస్ఈ ఆపరేషన్ బి.బిక్షపతి అధికారులను ఆదేశించారు.మంగళవారం ములుగు డివిజన్ పరిధిలోని వెంకటాపూర్ సెక్షన్‌లో ఉన్న నర్సాపూర్ సబ్‌స్టేషన్‌ను కన్న రాజు డీఈ/టెక్నికల్ మరియు ఆపరేషన్/ ములుగు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ సరఫరా పరిస్థితి, పరికరాల పనితీరు, లోడ్ల స్థితిగతులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, ఏవైనా లోపాలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు.విద్యుత్ అంతరాయాలు, లో-వోల్టేజ్ లేదా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేలా సమన్వయంతో పనిచేయాలని ఎస్ఈ సూచించారు. విఫలమైన ట్రాన్స్‌ఫార్మర్లను ఆలస్యం లేకుండా మార్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని తెలిపారు. విద్యుత్ మౌలిక వసతుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, వినియోగదారులు, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు.

# చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలి

- న్యూ లక్ష్మీపురం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర
- రాష్ట్రస్థాయి 'రగ్బీ' పోటీలకు న్యూ లక్ష్మీపురం కేజీబీవీ ఆణిముత్యాలు



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యార్థినులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, న్యూ లక్ష్మీపురం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర అన్నారు. ఖమ్మం ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో జరిగిన ఎస్జిఎఫ్ 'రగ్బీ' జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు న్యూ లక్ష్మీపురం కేజీబీవీ విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎస్జిఎఫ్ 'రగ్బీ' రాష్ట్రస్థాయి పోటీలకు అండర్ 17 కి చెందిన పదో తరగతి విద్యార్థినులు జి. క్రితిక, ఆర్. లాస్యశ్రీ, అండర్ 14 కి చెందిన 7వ తరగతి విద్యార్థిని బి. అక్షయ లు ఎంపిక య్యారు. విద్యార్థినులలో క్రీడా స్ఫూర్తిని నింపి, ప్రత్యేక శిక్షణతో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చిది ద్దుతున్న పీఈటి కొరకొప్పుల సునీతను అభినం దించా రు. రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎంపికైన విద్యార్థులను ఇంచార్జి టీచర్ రజిని, ఉపాధ్యాయురాళ్లు సుకన్య, నాగ మణి, రాధ, ఉమా, స్వాతి, జ్యోతి, టీచర్స్ సుమలత, యాస్మిన్, సఫియా బేగం, సుజాత, సుమలత, కవిత, ఉమాదేవి, పిఈటి సునీత, ఎఎన్ఎం రేణుక అభినందించారు.



# తొలి టీ20 శతకంతో అయ్యర్ విధ్వంసం

● వెస్టిండీస్‌పై భారత్ 8 వికెట్ల ఘన విజయం

**లక్నో, అక్టోబర్ 6:** భారత కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ తొలి అంతర్జాతీయ టీ20 శతకంతో చెలరేగడంతో వెస్టిండీస్‌పై భారత్ ఘన విజయం సాధించింది. లక్నోలోని ఎకానా స్టేడియంలో జరిగిన తొలి టీ20లో 172 పరుగుల లక్ష్యాన్ని భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యంలోకి వెళ్లింది. లక్ష్య ఛేదనలో భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ 21 పరుగులు చేయగా, సంజూ శాంసన్ 11 పరుగులకే ఔటయ్యారు. దీంతో 35 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌ను శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్ ఆదుకున్నారు. ఇద్దరూ కలిసి 137 పరుగుల అజేయ భాగస్వామ్యంతో జట్టును విజయతీరాలకు చేర్చారు. అయ్యర్ కేవలం 42 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. మొత్తంగా 43 బంతుల్లో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన అతని ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. ఇషాన్ కిషన్ 37 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అయ్యర్ దూకుడుతో భారత్ 32 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. షాయ్ హోప్ 52, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 56 పరుగులతో రాణించారు. భారత బౌలర్లలో అరంగేట్రం చేసిన నమన్ ధీర్ 3 వికెట్లు పడగొట్టగా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీశారు. అద్భుత శతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన శ్రేయాస్ అయ్యర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

# మంధాన శకం షురూ

## జింబాబ్వే సిరీస్‌కు భారత మహిళల జట్టు కెప్టెన్‌గా స్మృతి మంధాన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** భారత మహిళల క్రికెట్‌లో నవశకం మొదలైంది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో ఆమె స్థానంలో ఓపెనర్ స్మృతి మంధాన పూర్తి స్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనుంది. స్వదేశంలో జింబాబ్వేతో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు మంధానను సారథిగా ఎంపిక చేస్తూ సెలెక్టర్లు మంగళవారం జట్లను ప్రకటించారు. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు వన్డే వైస్ కెప్టెన్‌గా, ఓపెనర్ షఫాలీ వర్మకు టీ20 వైస్ కెప్టెన్‌గా అవకాశం కల్పించారు. కెప్టెన్సీ నుంచి తప్పుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ ప్లేయర్‌గా రెండు జట్లలోనూ కొనసాగనుంది. అక్టోబర్ 16 నుంచి భారత్, జింబాబ్వే మధ్య సిరీస్ ప్రారంభం కానుంది. **భారత వన్డే జట్టు** స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, హర్లీన్ డియోల్, తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), రీచా ఘోష్ (వికెట్ కీపర్), వైష్ణవి శర్మ, నందిని శర్మ, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే, రేణుకా ఠాకూర్. **భారత టీ20 జట్టు** స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ (వైస్ కెప్టెన్), నికి ప్రసాద్, హర్మన్‌ప్రీత్ కౌర్, అనుష్క శర్మ, రీచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), దీప్తి శర్మ, ప్రేమా రావత్, నందిని శర్మ, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, మిన్ను మణి, జింతిమణి కలిత.

# నాయకత్వానికి సెలవ్

- కెప్టెన్సీ నుంచి తప్పుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** భారత మహిళల క్రికెట్‌కు తొలి ఐసీసీ టైటిల్ ప్రపంచకప్‌ను అందించిన నాయకి హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వ బాధ్యతలకు వీడ్కోలు పలికింది. 2025 మహిళల వన్డే ప్రపంచకప్ విజయంతో భారత క్రికెట్‌కు జోష్ అందించిన హర్మన్‌ప్రీత్.. తాజాగా ఆసియా క్రీడల్లోనూ భారత్‌ను చాంపియన్‌గా నిలబెట్టింది. 37 ఏండ్ల హర్మన్‌ప్రీత్ కౌర్ భారత్‌కు మూడు ఫార్మాట్లలో కెప్టెన్‌గా వ్యవహరించిన అనంతరం నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు మంగళవారం తన సామాజిక మాధ్యమ ఖాతాలో వెల్లడించింది. ఆమె భారత్‌కు ఐదు టెస్టులు, 51 వన్డేలు, 155 టీ20ల్లో కెప్టెన్సీ వహించింది. బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా, చీఫ్ కోచ్ అమోల్ ముజుందార్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన సోమవారం గువహటిలో భారత క్రికెట్ రోడ్‌మ్యాప్‌పై చర్చించారు. ఆ తర్వాత ఒక్కరోజు వ్యవధిలోనే హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడం గమనార్హం. కెప్టెన్‌గా తప్పుకున్నప్పటికీ హర్మన్‌ప్రీత్ కౌర్ భారత జట్టులో కీలక క్రీడాకారిణిగా కొనసాగనుంది. ఇప్పటివరకు వైస్ కెప్టెన్‌గా ఉన్న స్మృతి మంధాన భారత మహిళల జట్టు నాయకత్వ పగ్గాలు అందుకోనుంది.

# భారత్ టాస్ గెలిచి బౌలింగ్

● టీ20 అరంగేట్రం చేసిన నమన్ ధీర్



**లక్నో, అక్టోబర్ 6:** వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం లక్నోలోని ఎకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన తొలి టీ20లో భారత కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్నారు. రాత్రి మంచు ప్రభావం ఉంటుందని భావించిన భారత్.. లక్ష్య ఛేదనకు మొగ్గుచూపింది. ఈ మ్యాచ్‌తో ఆల్‌రౌండర్ నమన్ ధీర్ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అతనికి తొలి టీ20 అంతర్జాతీయ క్యాప్‌ను అందజేశాడు. సెప్టెంబర్ 27న వెస్టిండీస్‌తోనే వన్డేల్లో అరంగేట్రం చేసిన నమన్ ధీర్‌కు ఇప్పుడు టీ20ల్లోనూ అవకాశం లభించింది. భారత తుది జట్టులో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్, తిలక్ వర్మ, శివమ్ దూబే, నమన్ ధీర్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, మయాంక్ యాదవ్ ఉన్నారు. వైభవ్ సూర్యవంశీ, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రిన్స్ యాదవ్‌లకు తుది జట్టులో చోటు దక్కలేదు. వెస్టిండీస్ జట్టుకు షై హోప్ కెప్టెన్‌గా వ్యవహరించడంతో పాటు వికెట్ కీపర్‌గా బాధ్యతలు చేపట్టాడు. మరోవైపు వెస్టిండీస్ స్పిన్నర్ అకీల్ హొసైన్‌కు ఇది 100వ టీ20 అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. అనంతరం తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 171 పరుగులకు ఆలౌట్ కాగా, భారత్ 14.4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ 43 బంతుల్లో 102 పరుగులతో అజేయ శతకం సాధించి భారత్‌కు ఎనిమిది వికెట్ల ఘన విజయం అందించాడు.

# 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి గట్టిపోటీ

- బిడ్డింగ్‌కు అక్టోబర్ 31 తుది గడువు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** 2036లో జరగనున్న ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని భారత్ చేస్తున్న ప్రయత్నాలకు గట్టి పోటీ ఎదురవుతోంది. విశ్వ క్రీడల నిర్వహణ హక్కుల కోసం భారత్‌తో పాటు జర్మనీ, హంగేరి, ఖతార్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, దక్షిణాఫ్రికా, తుర్కియే దేశాలు పోటీలో ఉన్నట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) వెల్లడించింది. భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించేందుకు 2024లోనే ప్రతిపాదన సమర్పించిన విషయం తెలిసిందే. ఐఓసీ అధ్యక్షురాలిగా కిర్‌స్టీ కొవెంట్రీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ ప్రక్రియపై సమీక్ష చేపట్టింది. ఇప్పటికే 2028 ఒలింపిక్స్‌కు లాస్ ఏంజెల్స్, 2032 క్రీడలకు బ్రిస్బేన్ వేదికలుగా ఖరారయ్యాయి. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం బిడ్డింగ్ వేసేందుకు అక్టోబర్ 31ని ఐఓసీ తుది గడువుగా నిర్ణయించింది. ప్రస్తుతం ఆసక్తి వ్యక్తం చేసిన ఏడు దేశాల ప్రతినిధులు నవంబర్‌లో ఐఓసీ ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు తమ ప్రాజెక్టులను వర్చువల్‌గా సమర్పించనున్నారు. అనంతరం ఐఓసీ ఆయా దేశాల ప్రతిపాదనలను పరిశీలించనుంది. వచ్చే ఏడాది మార్చిలో ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు వ్యూహాత్మక చర్చలు ప్రారంభించనుంది. ప్రాథమిక పరిశీలన అనంతరం అర్హత కలిగిన దేశాల ప్రాజెక్టులను మరింత లోతుగా పరిశీలించనుంది. 2028 డిసెంబర్‌లో అనువైన దేశాలతో ఐఓసీ చర్చలు జరపనుండగా, 2029 మధ్యలో 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశాన్ని ఐఓసీ సభ్యులు ఖరారు చేయనున్నారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా గంగూలీ

- ఐపీఎల్ 2027 సీజన్‌కు సౌరవ్ గంగూలీ నియామకం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ప్రధాన కోచ్‌గా నియమితులయ్యారు. ఐపీఎల్ 2027 సీజన్ కోసం గంగూలీని హెడ్ కోచ్‌గా నియమించినట్లు ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ మంగళవారం ప్రకటించింది. 2019లో సలహాదారుగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో గంగూలీ అనుబంధం ప్రారంభమైంది. ఆ తర్వాత ఫ్రాంచైజీలో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. పురుషుల, మహిళల జట్లకు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా కూడా పనిచేశారు. తాజాగా ప్రధాన కోచ్‌గా కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. హెడ్ కోచ్ బాధ్యతలు చేపట్టడం పట్ల గంగూలీ సంతోషం వ్యక్తం చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ తనకు ఎంతో ప్రత్యేకమైన జట్టు అని, యాజమాన్యం, సహాయక సిబ్బంది, ఆటగాళ్లతో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు. ప్రతిభావంతమైన ఆటగాళ్లతో బలమైన, నిర్భయమైన జట్టును నిర్మించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఢిల్లీ క్యాపిటల్స్‌కు హేమాంగ్ బదానీ ప్రధాన కోచ్‌గా వ్యవహరించారు. ఆయన స్థానంలో గంగూలీ బాధ్యతలు స్వీకరించనున్నారు. గత రెండు సీజన్లలో జట్టు ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోవడంతో కోచింగ్, వ్యూహాలు, ఆటగాళ్ల ఎంపికపై ఫ్రాంచైజీ దృష్టి సారించింది.

# టీమిండియాకు ఓపెనింగ్ తలనొప్పి

● వైభవ్ కోసం బెంచ్‌పై ఉండేది ఎవరు..?



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** భారత క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. ముఖ్యంగా టీ20ల్లో విధ్వంసక బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్న 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు సీనియర్ ఆటగాళ్లకు సవాల్‌గా మారాడు. అతడిని ఆడించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ కొన్ని సందర్భాల్లో కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఐర్లాండ్ పర్యటనకు ఎంపికైన వైభవ్ బెంచ్‌కే పరిమితం కాగా, ఇంగ్లండ్‌తో సిరీస్‌లో సంజూ శాంసన్‌ను తప్పించి అతడికి అవకాశం కల్పించారు. పెద్ద బౌండరీలున్న ఇంగ్లండ్ పిచ్‌లపై భారీ స్కోర్లు చేయకపోయినా తన దూకుడైన ఆటతో ఆకట్టుకున్నాడు. జింబాబ్వే పర్యటనలో రెండు అర్ధ శతకాలతో సత్తా చాటాడు. అయితే అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన సిరీస్‌లో మాత్రం అతడికి అవకాశం లభించలేదు. వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్ నేపథ్యంలో మరోసారి వైభవ్ పేరు తెరపైకి వచ్చింది. ఓపెనర్‌గా అభిషేక్ శర్మకు చోటు దాదాపు ఖాయమవడంతో మరో స్థానానికి సంజూ శాంసన్, వైభవ్ మధ్య పోటీ నెలకొంది. ఈ క్రమంలో వరల్డ్‌కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన సంజూను పక్కన పెట్టాల్సిన పరిస్థితి రావడం టీమ్ మేనేజ్‌మెంట్‌కు సవాల్‌గా మారింది. వైభవ్ విషయంలో బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కీలక వ్యాఖ్యలు చేశారు.

చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయికి వచ్చిన వైభవ్ ప్రస్తుతం జట్టుతో ఎక్కువ సమయం గడుపుతూ నాణ్యమైన ఆటగాళ్లను గమనించడం, వారి నుంచి నేర్చుకోవడం ద్వారా మరింత మెరుగవ్వాలని సూచించారు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కూడా ప్రతిభ ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో అవకాశం కోసం ఎదురుచూడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎనిమిది టీ20ల్లో ఆడిన వైభవ్ రెండు అర్ధ శతకాలతో 246 పరుగులు చేశాడు. అతడి స్ట్రైక్ రేట్ 186.36గా ఉండగా, అత్యధిక వ్యక్తిగత స్కోరు 81 పరుగులు. దీంతో వెస్టిండీస్‌తో సిరీస్‌లో అతడికి అవకాశం లభిస్తుందా? లేక సీనియర్ ఆటగాళ్లకే మరోసారి ప్రాధాన్యం ఇస్తారా? అనే ఆసక్తి నెలకొంది.

# 9 మంది దర్శకులతో 'కామ్రేడ్ కల్యాణ్' ట్రైలర్ లాంచ్

విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టాలీవుడ్‌కు చెందిన 9 మంది ప్రముఖ దర్శకులు ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. రామ్ గోపాల్ వర్మ, హరీశ్ శంకర్, అనిల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, బాబీ, శివ నిర్వాణ, నందిని రెడ్డి, బీవీఎస్ రవి, రామ్ అబ్బరాజు వంటి అగ్ర దర్శకులు కలిసి ఈ ట్రైలర్‌ను లాంచ్ చేయడం ఇండస్ట్రీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'కామ్రేడ్ కల్యాణ్' ట్రైలర్ విషయానికొస్తే, ఆద్యంతం నవ్వులు పంచేలా దీన్ని తీర్చిదిద్దారు. ఒక థియేటర్ ఓనర్ అయిన హీరో, అనుకోకుండా 'కామ్రేడ్'గా మారడం, ఆ తర్వాత జరిగే పరిణామాలు ఫన్నీగా ఉంటాయని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. శ్రీవిష్ణు తనదైన కామెడీ టైమింగ్‌తో, మేనరిజమ్స్‌తో ఆకట్టుకున్నారు. ఆయన తల్లి పాత్రలో సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ నటన, కమెడియన్ సత్యతో సాగే సన్నివేశాలు నవ్వులు పూయించడం ఖాయంగా కనిపిస్తోంది. వెన్నెల కిషోర్, ఉపేంద్ర లిమాయే వంటి నటులు కూడా తమ పాత్రల్లో ఒదిగిపోయారు. ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, షైన్ టామ్ చాకో కీలకమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న 'కామ్రేడ్ కల్యాణ్' సినిమాను వెంకటకృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. తన సినిమాకు మద్దతుగా నిలిచిన దర్శకులకు కోన వెంకట్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. "నా బలం, నా వాళ్లు" అంటూ వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన రాగా, తాజాగా విడుదలైన కామెడీ ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. పూర్తిస్థాయి వినోదాన్ని పంచేలా రూపొందిన 'కామ్రేడ్ కల్యాణ్' ఈ నెల 9న థియేటర్లలో విడుదల కానుంది.




# పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో వేట మొదలుపెట్టిన టైగర్

సూపర్‌స్టార్ రజినీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమా నుంచి అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించిన పవర్‌ఫుల్ ట్రైలర్‌ను సోమవారం చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ విడుదల చేసింది. ఆద్యంతం యాక్షన్ సన్నివేశాలు, ఆకట్టుకునే సంభాషణలతో నిండిన ఈ ట్రైలర్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. "టైగర్ ముత్తువేల్ పాండియన్ తిరిగి వచ్చాడు. వేట మొదలైంది!" అనే క్యాప్షన్‌తో సన్ పిక్చర్స్ సోషల్ మీడియాలో ఈ ట్రైలర్‌ను పంచుకుంది. ట్రైలర్ ప్రారంభంలో, నటుడు సూరజ్ వెంజరమూడు పాత్ర తన వద్ద బందీగా ఉన్న వ్యక్తిని ప్రశ్నించడంతో మొదలవుతుంది. "గత రెండు నెలల్లో ఈ పని చేసిన వ్యక్తి గురించి నీకు ఏమైనా తెలిసిందా?" అని అడగ్గా, "నాకే కాదు, నువ్వు కూడా అతడిని కనిపెట్టలేవు" అని బందీ సమాధానమిస్తాడు. కేవలం సూరజ్ పాత్రే కాకుండా, చాలా మంది విలన్లు తమకు జరుగుతున్న నష్టం వెనుక ఎవరున్నారని తలలు పట్టుకుంటున్నట్టు ట్రైలర్‌లో చూపించారు. ఆ తర్వాతే టైగర్ ముత్తువేల్ పాండియన్‌గా రజినీకాంత్ స్టైల్‌గా ఎంట్రీ ఇస్తారు. కథనం ప్రకారం, ముత్తువేల్ పాండియన్ ఒక డ్రైవర్‌గా నటిస్తూ అండర్‌కవర్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. విలన్ల నెట్‌వర్క్‌లో ఇంకా పెద్ద తలలు ఎవరైనా ఉన్నారా అని కనిపెట్టేందుకే అతను ఈ వ్యూహం పన్నినట్టు ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. తన శత్రువులను అంతం చేయడానికి టైగర్ స్నైపర్లను ఉపయోగించగా, తాము కూడా స్నైపర్లను వాడగలమని విలన్‌గా నటిస్తున్న ఎస్.జె. సూర్య చెప్పడం ఆసక్తిని రేపుతోంది. ఈ ట్రైలర్‌లో రజినీకాంత్, విద్యా బాలన్ మధ్య జరిగే సంభాషణ కూడా ఆకట్టుకుంటుంది. "టీ తాగుతారా, కాఫీ తాగుతారా?" అని ఆమె అడిగితే, సున్నితంగా వద్దని ఆయన అంటారు. దానికి ఆమె, "ఆప్షన్ టీ లేదా కాఫీకి మధ్య మాత్రమే, తాగడమా వద్దా అని కాదు" అని బదులివ్వడం గమనార్హం. "కల్పక్స్" అనే భయంకరమైన వ్యక్తుల గురించి ఒకరు హెచ్చరించగా, "అయ్యో, నాకు తెలియదే.. చూద్దామా?" అని రజినీ నవ్వుతూ చెప్పే డైలాగ్ ఆయన పాత్రలోని ధైర్యాన్ని తెలియజేస్తుంది. పాత కాలం రౌడీయిజానికి, ఇప్పటి ట్రెండ్‌కు తేడా వివరిస్తూ, "శత్రువులందరినీ ఒకేచోటకి చేర్చి బాంబు పెట్టడమే ఇప్పటి స్టైల్" అని రజినీ చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్ ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచింది. ఇదివరకే విడుదలైన రిలీజ్ డేట్ టీజర్‌లో వినాయకన్ పాత్ర "నన్ను చంపి నువ్వు ప్రశాంతంగా ఉండలేవు. నా వెనుక పెద్ద ప్రపంచం ఉంది. ఎవరు, ఎప్పుడు, ఎలా వస్తారో నీకు తెలియదు. నీ జీవితం నరకంగా మారుతుంది" అని హెచ్చరించడం తెలిసిందే. దానికి కొనసాగింపుగా ఈ ట్రైలర్ ఉండటంతో సినిమాపై ఉత్కంఠ పెరిగింది. ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు.






# అనుపమ క్యూట్ స్మైల్.. ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్న లుక్!

టాలీవుడ్ క్యూట్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న ట్రెడిషనల్ ఫోటోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. పచ్చని ప్రకృతి నడుమ, తనదైన చిరునవ్వుతో ఆమె దిగిన పిక్స్ నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వైబ్రెంట్ గ్రీన్ సిల్క్ శారీలో అచ్చం పక్కింటి అమ్మాయిలా కనిపిస్తూ, కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్న ఈ అందమైన ఫోటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. గ్రీన్ సిల్క్ శారీ అండ్ ఎమరాల్డ్ టోన్స్ : తాజా ఫోటోషూట్ కోసం అనుపమ పరమేశ్వరన్ అద్భుతమైన ఎమరాల్డ్ గ్రీన్ చీరను ఎంచుకుంది. డ్యూయల్-టోన్ టెక్స్చర్‌తో పాటు చీర అంతటా సన్నని గోల్డెన్ హారిజాంటల్ స్ట్రిప్స్, అంచుల వెంబడి వెడల్పాటి గోల్డ్ బార్డర్ ఉన్న ఈ చీర ఆమెకు రాయల్ లుక్‌ను తెచ్చిపెట్టింది. ఇక దీనికి మ్యాచింగ్‌గా క్లోజ్-నెక్, ఎల్బో-లెంత్ బ్లౌజ్ ధరించి ఎంతో పద్ధతిగా, కనిపించింది. ట్రెడిషనల్ జ్యువెలరీ అండ్ నేచురల్ మేకప్ : ఈ సాంప్రదాయ లుక్‌ను మరింత హైలైట్ చేయడానికి అనుపమ సున్నితమైన గోల్డ్ చోకర్ నెక్లెస్, చేతి నిండా పచ్చని గాజులు, గోల్డెన్ బ్యాంగిల్స్ ధరించింది. నుదుట చిన్న బొట్టు, ముఖంపై పడే రింగుల జుట్టు (సాఫ్ట్ కర్ల్స్), ఎలాంటి హంగుబాట్లు లేని నాచురల్ మేకప్ ఆమె అందాన్ని రెట్టింపు చేశాయి. "మగలే" మూమెంట్‌ను తలపించేలా ఆమె ఇచ్చిన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయ్ సౌత్ ఇండస్ట్రీలో వరుస విజయాలు: ఇక 'అ ఆ' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన అనుపమ, 'ఉన్నది ఒకటే జిందగీ', 'కార్తికేయ 2', అలాగే బ్లాక్‌బస్టర్ 'టిల్లు స్క్వేర్' చిత్రాలతో తన సత్తా చాటింది. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా తమిళ, కన్నడ పరిశ్రమల్లోనూ వైవిధ్యమైన పాత్రలు చేస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. చేతిలో క్రేజీ ప్రాజెక్టులు: ప్రస్తుతం అనుపమ కెరీర్ ఫుల్ స్పీడ్‌లో దూసుకెళ్తోంది. ఇటీవలే 'డ్రాగన్', 'పరధ', 'బైసన్ కాలమదన్', 'కిష్కింధపురి' , 'లాక్‌డౌన్', 'మరీచిక' వంటి చిత్రాలతో అలరించిన ఆమె, త్వరలో 'క్రేజీ కల్యాణం', 'భోగి' వంటి క్రేజీ ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక తన సహజమైన నటన, క్యూట్ స్మైల్‌తో కోట్లాది మంది హృదయాలను గెలుచుకుంటున్న అనుపమ పరమేశ్వరన్, రాబోయే రోజుల్లో వెండితెరపై మరిన్ని ఘన విజయాలు సాధించాలని అభిమానులు మనసారా కోరుకుంటున్నారు



# "అందుకే మా రిలేషన్‌షిప్‌ను సీక్రెట్‌గా ఉంచాం"..

### ఆసక్తికర విషయాలను పంచుకున్న విజయ్-రష్మిక



సెలబ్రిటీల ప్రేమకథల్లో ఏదో ఒక దశలో 'ఎప్పుడు ప్రేమలో పడ్డారు?', 'ఎవరు ముందుగా ప్రపోజ్ చేశారు?' అనే ప్రశ్నలు వస్తూనే ఉంటాయి. రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ విషయంలో మాత్రం ఈ ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పడం కాస్త కష్టమే. ఎందుకంటే.. తమ బంధానికి వాళ్లు ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన తేదీ పెట్టుకోలేదు. ప్రేమను ప్రకటించుకోలేదు. ప్రపోజ్ కూడా చేసుకోలేదు. అయినా ఒకరితో ఒకరు ఉంటూ.. తమ బంధం ఎప్పుడు ప్రేమగా మారిందో తెలియకుండానే పెళ్లి వరకు వచ్చేశారు. 2026 ఫిబ్రవరిలో రష్మిక, విజయ్ పెళ్లి చేసుకున్నారు. అప్పటివరకు వీరిద్దరి గురించి ఎన్నో వార్తలు వచ్చినా.. తమ వ్యక్తిగత జీవితంపై మాత్రం ఇద్దరూ పెద్దగా మాట్లాడలేదు. తాజాగా 'రణబాలి' ప్రమోషన్లలో భాగంగా శుభంకర్ మిశ్రా పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఈ జంట.. చాలాకాలం తమ రిలేషన్‌షిప్‌ను ఎందుకు ప్రైవేట్‌గా ఉంచారో చెప్పారు. విజయ్ మాటల్లో చెప్పాలంటే.. రష్మికతో తన పరిచయం తొలుత ప్రేమతో మొదలవలేదు. ఇద్దరూ కలిసి పనిచేసే కోస్టార్స్ అంతే. ఆ పరిచయం కాస్తా స్నేహంగా మారింది. అది పెరిగేకొద్దీ ఒకరంటే ఒకరికి ఇష్టం పెరిగింది. చివరికి అదే బంధం పెళ్లి వరకు వెళ్లింది. అయితే ఈ మొత్తం ప్రయాణాన్ని తాము దాచిపెట్టేందుకు ఎప్పుడూ ప్రయత్నించలేదని విజయ్ చెప్పాడు. బయట ప్రపంచానికి తమ బంధం గురించి చెప్పాలనే అవసరం మాత్రం తనకు అనిపించలేదన్నాడు. తన వ్యక్తిగత జీవితం గురించి అందరికీ చెప్పాల్సిన బాధ్యత తనపై లేదనే భావనతోనే ఉన్నానని విజయ్ స్పష్టం చేశాడు.

# తెలుగు సినిమా ఒక్కటే.. తెలంగాణ, ఆంధ్ర అని విడగొట్టొద్దు: నరేశ్



తెలుగు చిత్ర పరిశ్రమలో సినిమాలను ప్రాంతాల వారీగా విభజించడం సరికాదని, ఉన్నది ఒకే ఒక్క తెలుగు సినిమా అని సీనియర్ నటుడు నరేశ్ అన్నారు. ఇటీవల తెలంగాణ సినిమా, రాయలసీమ సినిమా, ఉత్తరాంధ్ర సినిమా అంటూ ముద్రలు వేయడం ఒక ఫ్యాషన్‌గా మారిపోయిందని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో జరిగిన 'గరివిడి లక్ష్మి' బయోపిక్ ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. "పాటలకు, సంగీతానికి ఎలాగైతే సరిహద్దులు ఉండవో, సినిమాకు కూడా ఎలాంటి ప్రాంతీయ భేదాలు ఉండవు. ప్రేక్షకులు కొరియన్, మలయాళం, తమిళ సినిమాలను భాషతో సంబంధం లేకుండా ఆదరిస్తున్నప్పుడు, మన సినిమాలను మనం ఎందుకు ప్రాంతాల వారీగా విడదీస్తున్నాం?" అని ప్రశ్నించారు. తమిళంలో వచ్చిన 'మణ్ వాసనై' (మట్టి వాసన) సినిమాను ఉదాహరిస్తూ... మట్టి వాసనకు ప్రాంతంతో సంబంధం లేదని, అది అందరినీ కలుపుతుందని అన్నారు. 'గరివిడి లక్ష్మి' కథ కూడా ప్రతి తెలుగు ప్రేక్షకుడిని కదిలిస్తుందని తెలిపారు. ప్రముఖ బుర్రకథ కళాకారిణి గరివిడి లక్ష్మి జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంపై నరేశ్ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. "ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించే మొదటి చిత్రం 'గరివిడి లక్ష్మి' అవుతుంది. ఇది 'మహానటి'లా వినోదం, భావోద్వేగాలు కలగలిపిన బయోపిక్. ఈ చిత్రానికి జాతీయ అవార్డులు కూడా వస్తాయని ఆశిస్తున్నా" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 17న థియేటర్లలో విడుదల కానుంది.

# పుస్తక రూపంలో రమాప్రభ జీవిత కథ.. 'ఇదేనండి నా కథ' ఆవిష్కరణ

సీనియర్ నటి రమాప్రభ జీవిత ప్రయాణం పుస్తక రూపంలోకి వచ్చింది. 'రమాప్రభ.. ఇదేనండి నా కథ' పేరుతో వెలువడిన ఈ పుస్తకాన్ని ఆమె 81వ పుట్టినరోజు సందర్భంగా ఆవిష్కరించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలోని బసినకొండ పంచాయతీ, గంగన్నగారిపల్లెలో ఉన్న ఆమె నివాసంలో స్థానిక ప్రముఖులు, అభిమానులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొంతకాలంగా సినీ పరిశ్రమకు దూరంగా ఉంటూ రమాప్రభ ఆధ్యాత్మిక జీవనం గడుపుతున్నారు. స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు జింకల మోహనవల్లి, ఏడాది పాటు ఆమెను ఒప్పించి ఈ పుస్తకాన్ని రచించారు. సాధారణంగా చాలామంది తమ ఆత్మకథలను తామే రాసుకుంటారని, కానీ తన కథను మరొకరు రాయడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా రమాప్రభ అన్నారు.



రమాప్రభ పుట్టినరోజున ఈ పుస్తకాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉందని రచయిత్రి మోహనవల్లి తెలిపారు. నాలుగు దశాబ్దాలకు పైగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 1400కు పైగా చిత్రాల్లో నటించి రమాప్రభ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈ పుస్తకంలో ఆమె సినీ జీవితంలోని ఎత్తుపల్లాలతో పాటు, వ్యక్తిగత జీవితంలోని తీపి, చేదు జ్ఞాపకాలను పొందుపరిచారు. చిత్రజ్యోతి కథనం ప్రకారం, ఈ కార్యక్రమానికి నవలా రచయిత టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి, యాదవల్లి భారతి, పలువురు స్థానిక ప్రముఖులు, ఆమె అభిమానులు హాజరయ్యారు. వెండితెరపై ఓ వెలుగు వెలిగిన నాటి నుంచి మదనపల్లెలో ప్రశాంత జీవనం గడుపుతున్న నేటి వరకు ఆమె ప్రయాణాన్ని ఈ పుస్తకం ఆవిష్కరిస్తుంది.